సాక్షి

జోగులాంబ గద్వాల

శుక్రవారం । 18 । జూలై । 2025

గరిష్ఠం/కనిష్ఠం
37.2 /24.3

వాతావరణం

ఆకాశం నిర్మానుష్యంగా ఉంటుంది. అప్పుడప్పుడు మేఘావృతమై చిరు జల్లులు కురిసే అవకాశం ఉంది.

నేడు సీఎం రేవంత్‌రెడ్డి రాక

- జటప్రోల్‌లో యంగ్ ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ నిర్మాణానికి శంకుస్థాపన
- భారీ బహిరంగ సభలో ప్రసంగించనున్న ముఖ్యమంత్రి
- ఏర్పాట్లు పూర్తిచేసిన అధికార యంత్రాంగం



సీఎం పర్యటన ఏర్పాట్లను పరిశీలిస్తున్న కలెక్టర్ బదావత్ సంతోష్

సాక్షి, నాగర్‌కర్నూల్: నాగర్‌కర్నూల్ జిల్లాలో శుక్రవారం సీఎం రేవంత్‌రెడ్డి పర్యటించనున్నారు. పెంట్లవెల్లి మండలం జటప్రోల్‌లో రూ.150 కోట్లతో నిర్మించనున్న యంగ్‌ఇండియా రెసిడెన్షియల్ స్కూల్ భవన నిర్మాణానికి ఆయన శంకుస్థాపన చేయనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో అధికారులు అన్ని ఏర్పాట్లు పూర్తిచేశారు. రాష్ట్ర ఎక్సైజ్, పర్యాటకశాఖ మంత్రి జూపల్లి కృష్ణారావు, కలెక్టర్ బదావత్ సంతోష్ సీఎం పర్యటన ఏర్పాట్లను ఎప్పటికప్పుడు పర్యవేక్షించారు. జటప్రోల్ సమీపంలో 22 ఎకరాల సువిశాల స్థలంలో యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ సముదాయం నిర్మించనున్నారు. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ వర్గాలకు చెందిన విద్యార్థులు ఒకేచోట ఉండి అంతర్జాతీయ ప్రమాణాలతో నాణ్యమైన విద్య అభ్యసించేలా ప్రభుత్వం ఏర్పాట్లు చేస్తోంది.

మహిళలకు వడ్డీ లేని రుణాలు..

యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణం కోసం శంకుస్థాపన అనంతరం జటప్రోలులో నిర్వహించే భారీ బహిరంగ సభలో సీఎం ప్రసంగిస్తారు. బహిరంగ సభకు జనసమీకరణతో పాటు ఏర్పాట్లను అధికారులు పూర్తిచేశారు. ఇందిరా మహిళాశక్తి కింద స్వయం సహాయక సంఘాల సభ్యులకు వడ్డీలేని రుణాలను ముఖ్యమంత్రి చేతులమీదుగా పంపిణీ చేయనున్నారు.

మదనగోపాలస్వామి ఆలయంలో పూజలు..

సీఎం రేవంత్‌రెడ్డి జటప్రోల్‌లోని పురాతన మదన గోపాలస్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు నిర్వహించనున్నారు. సీఎం పర్యటన నేపథ్యంలో మదనగోపాలస్వామి ఆలయాన్ని సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దారు. గురువారం కలెక్టర్ సంతోష్ సైతం ఆలయాన్ని సందర్శించి ఏర్పాట్లను పరిశీలించారు.

మొదటిసారిగా కొల్లాపూర్‌కు..

ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారిగా రేవంత్‌రెడ్డి కొల్లాపూర్ నియోజకవర్గానికి రానున్నారు. కృష్ణాతీరంలో మారుమూల ప్రాంతంగా ఉన్న నియోజకవర్గంలో అభివృద్ధికి ఇతోధికంగా నిధులు మంజూరు చేయనున్నారన్న అంచనాలు నెలకొన్నాయి. ప్రధానంగా నల్లమల అటవీ ప్రాంతం, కృష్ణాతీర ప్రాంతాల్లో పర్యాటక అభివృద్ధికి నిధులు ప్రత్యేకంగా విడుదల చేసే అవకాశాలున్నాయి. పాలమూరు- రంగారెడ్డి ఎత్తిపోతల పథకం పెండింగ్, కల్వకుర్తి ఎత్తిపోతల పథకం విస్తరణ పనులపై స్పష్టత వచ్చే అవకాశం ఉంది. జిల్లాలో రోడ్ల విస్తరణ, అభివృద్ధి పనుల కోసం పెద్దఎత్తున నిధులు మంజూరు చేస్తారని జిల్లావాసులు ఆశాభావం వ్యక్తం చేస్తున్నారు.

ముఖ్యమంత్రి పర్యటన ఇలా..



■ మధ్యాహ్నం ఒంటిగంటకు హైదరాబాద్ నుంచి హెలీకాప్టర్‌లో బయలుదేరుతారు. ■ మధ్యాహ్నం 1.45 గంటలకు జటప్రోల్ చేరుకుంటారు. ■ 1.55 గంటలకు జటప్రోల్‌లోని పురాతన మదనగోపాలస్వామి ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు నిర్వహిస్తారు. ■ 2.10 గంటలకు యంగ్‌ఇండియా ఇంటిగ్రేటెడ్ స్కూల్ భవన నిర్మాణానికి శంకుస్థాపన చేస్తారు. ■ 2.20 నుంచి సాయంత్రం 4 గంటల వరకు జటప్రోల్‌లో నిర్వహించే బహిరంగ సభలో పాల్గొంటారు. ■ సభలోనే ఇందిరా మహిళాశక్తి కింద మహిళలకు వడ్డీలేని రుణాలను పంపిణీ చేస్తారు. ■ సాయంత్రం 4.30 గంటలకు తిరిగి హెలీకాప్టర్ ద్వారా హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

రేపు స్పాట్ కౌన్సెలింగ్

కొత్తకోట రూరల్: కొండా లక్ష్మణ్ తెలంగాణ ఉద్యాన విశ్వవిద్యాలయంలో 2025–26 విద్యా సంవత్సరానికిగాను పాలిటెక్నిక్ కోర్సుల్లో ప్రవేశాలకు శనివారం స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నట్లు మోజర్ల ఉద్యాన కళాశాల అసోసియేట్ డీన్ డా. పిడిగం సైదయ్య గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇప్పటికే దరఖాస్తు చేసుకున్న 10వ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అన్ని ఒరిజినల్ ధ్రువపత్రాలతో ఉదయం 10 గంటల వరకు కొండా లక్ష్మణ్ తెలంగాణ రాష్ట్ర ఉద్యాన యూనివర్సిటీ, ములుగు (సిద్దిపేట జిల్లా)లోని పరిపాలన భవనంలో జరిగే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరు కావాలన్నారు. దరఖాస్తు చేయని విద్యార్థులు సైతం నేరుగా హాజరుకావచ్చని.. మరింత సమాచారం కోసం సెల్‌ఫోన్ నంబర్లు 77805 09322, 76830 53157 సంప్రదించాలని సూచించారు. మోజర్లలోని కొల్లాపూర్ ఉద్యాన పాలిటెక్నిక్ కళాశాలలో నిపుణులైన అధ్యాపకులు, బోధనేతర సిబ్బందితో పాటు హాస్టల్ వసతి, ప్రయోగశాలలు, తోటల విస్తీర్ణం ఉన్నాయని అసోసియేట్ డీన్ వివరించారు. వనపర్తి, నాగర్‌కర్నూల్, మహబూబ్‌నగర్, నారాయణపేట, జోగుళాంబ గద్వాల జిల్లాల విద్యార్థులకు ఇక్కడి ప్రాంగణం దగ్గరగా ఉంటుందని.. సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

న్యూస్‌రీల్

మిషన్ భగీరథ పైపులైన్ లీకేజీ

- జిల్లా వ్యాప్తంగా రెండురోజులు నీటి సరఫరా బంద్



ధరూరు: ప్రియదర్శిని జూరాల ప్రాజెక్టు వద్ద ఉన్న మిషన్ భగీరథ ప్రాజెక్టు నుంచి కోరుకొండయ్య గట్టుకు వెళ్లే ప్రధాన పైప్‌లైన్ గురువారం లీకేజీ అయ్యింది. నర్సన్‌దొడ్డి గ్రామ సమీపంలో సాయంత్రం పైప్‌లైన్ పగలడంతో నీరు పెద్ద ఎత్తున ఎగిసిపడ్డాయి. గమించిన స్థానికులు మిషన్ భగీరథ అధికారులకు తెలియజేయడంతో నీటి పంపింగ్‌ను నిలిపివేశారు. ప్రధాన పైప్‌లైన్ కావడంతో జిల్లాలోని దాదాపు అన్ని మండలాలకు రెండు రోజుల పాటు తాగు నీటి సరఫరా నిలిచిపోనుంది. శుక్ర, శనివారాల్లో మరమ్మతు పనులు చేపట్టి ఆదివారం నీటి సరఫరాను పునరుద్ధరించనున్నట్లు మిషన్ భగీరథ అసిస్టెంట్ ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ సీహెచ్ ఆదిత్య ఓ ప్రకటనలో తెలిపారు.

స్కాలర్‌షిప్‌లకు దరఖాస్తులు

గద్వాల: 2025–26 విద్యా సంవత్సరానికిగాను పోస్ట్‌మెట్రిక్ ఉపకార వేతనాల కోసం దరఖాస్తు చేసుకొనుటకు సెప్టెంబర్ 30వ తేదీ వరకు ప్రభుత్వం అవకాశం కల్పించినట్లు జిల్లా షెడ్యూల్డ్ కులాల అభివృద్ధి అధికారి నుషిత ఓ ప్రకటనలో తెలిపారు. జిల్లా వ్యాప్తంగా ఉన్న ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనార్టీ విద్యార్థిని, విద్యార్థులు వారి అర్హతను బట్టి పోస్ట్‌మెట్రిక్ కోర్సులు చదువుతున్న ఫ్రెష్ మరియు రెన్యూవల్ కోసం తమ వివరాలను వెబ్‌సైట్ www.epass.cgg.gov.in లో దరఖాస్తు చేసుకోవాలని కోరారు.

ప్రతి గింజను కొనుగోలు చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ బీఎం సంతోష్, పక్కన ఎస్పీ శ్రీనివాస్‌రావు

- కలెక్టర్ బీఎం సంతోష్
- సీడ్ కంపెనీల ప్రతినిధులు, ఆర్గనైజర్లతో సమావేశం

గద్వాల: రైతులు పండించిన ప్రతి విత్తన పత్తి గింజను కొనుగోలు చేయాలని కలెక్టర్ బీఎం సంతోష్ అన్నారు. గురువారం ఐడీవోసీ కార్యాలయంలో కాన్ఫరెన్స్ హాలులో వ్యవసాయశాఖ, సీడ్‌కంపెనీల ప్రతినిధులు, సీడ్‌ఆర్గనైజర్లతో సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వం రైతుల సంక్షేమానికి అధిక ప్రాధాన్యత ఇస్తుందని, రైతులు పండించిన పత్తివిత్తన పంట దిగుబడి మొత్తాన్ని ఖచ్చితంగా కొనుగోలు చేయాలని ఆదేశించారు. పత్తివిత్తన పంట జిల్లాలో ప్రధాన పంటగా సాగుచేస్తున్నారని, మొత్తం 40వేల ఎకరాల్లో విత్తన పత్తి పంటను సాగుచేస్తున్నట్లు తెలిపారు. మొత్తం 35 కంపెనీల ద్వారా పంపిణీ చేసిన రైతులు పండించిన సీడ్ పత్తి విత్తన పంటను ఆయా కంపెనీలు తప్పనిసరిగా కొనుగోలు చేయాలన్నారు. రైతులకు అన్ని రకాల న్యాయం చేసేందుకు జిల్లా యంత్రాంగం అంకితభావంతో పనిచేస్తుందన్నారు. రైతులు ఎలాంటి అపోహలను నమ్మవద్దని సూచించారు. అనంతరం ఎస్పీ శ్రీనివాస్‌రావు మాట్లాడుతూ గత రెండు రోజులుగా బీంగిదొడ్డిలో రైతులు ధర్నా చేయడం వల్ల అనేక రకాల శాంతిభద్రతల సమస్యలు తలెత్తాయన్నారు. రైతులకు ఏదైన సమస్య ఉంటే వెంటనే సంబంధిత అధికారులు, పోలీసు శాఖకు ముందస్తు తెలియజేయాలన్నారు. అదనపు కలెక్టర్ వి.లక్ష్మీనారాయణ, వ్యవసాయ జాయింట్ డైరెక్టర్ సుచరిత, డీఏవో సక్రియా నాయక్ పాల్గొన్నారు.

రైతులకు అన్యాయం చేస్తే సహించం



కలెక్టరేట్ వద్ద ధర్నా చేస్తున్న రైతులు, ప్రతిపక్ష పార్టీలకు చెందిన నాయకులు

గద్వాల: సీడుపత్తి సాగుచేస్తున్న రైతులకు అన్యాయం జరిగితే సహించేది లేదని ప్రత్యక్ష ఆందోళనకు పూనుకుంటామని ప్రతిపక్షపార్టీ బీజేపీ, బీఆర్‌ఎస్, నడిగడ్డ హక్కుల పోరాటసమితి, తెలంగాణ రైతుసంఘం పార్టీలకు చెందిన నాయకులు అన్నారు. గురువారం కలెక్టరేట్ ఎదుట సీడు పత్తిరైతులతో కలిసి ధర్నా చేపట్టారు. ఈసందర్భంగా నాయకులు మాట్లాడుతూ ఈ ఏడాది కంపెనీలు ఇచ్చిన విత్తనాలతో పంట సాగు చేశారని, రెండు నెలల తర్వాత ఒక్కోరైతు నుంచి కేవలం 2 క్వింటాళ్ల పత్తి విత్తనాలు మాత్రమే కొనుగోలు చేస్తామని సీడ్ కంపెనీలు, సీడ్ ఆర్గనైజర్లు చెప్పడంతో రైతులు దిక్కుతోచని స్థితిలో పడ్డారన్నారు. రూ.లక్షలు పెట్టుబడి పెట్టి నష్టపోయారని, రైతులు పండించిన పూర్తి పంటను కొనుగోలు చేయాలని డిమాండ్ చేశారు.

కలెక్టర్ హామీతో ధర్నా విరమణ

రైతుల చేపట్టిన ధర్నా వద్దకు కలెక్టర్ బీఎం సంతోష్ వచ్చి సీడుపత్తి రైతులు పండించిన పంటల దిగుబడులు మొత్తాన్ని సీడ్‌కంపెనీలు, సీడ్‌ఆర్గనైజర్లు తీసుకునేందుకు ఒప్పుకున్నారని, ఇందుకు సంబంధించి వారు లిఖితపూర్వకంగా హామీ ఇచ్చినట్లు చెప్పడంతో ధర్నాను విరమించారు. కార్యక్రమంలో నాయకులు, నాగర్‌దొడ్డి వెంకట్రాములు, ఇక్బాల్ పాష, రామాంజనేయులు, బండల వెంకట్రాములు, వివి నర్సింహా, కుర్వపల్లయ్య, రంజిత్‌కుమార్, బుచ్చిబాబు,లవన్న తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

చికిత్స పొందుతూ వ్యక్తి మృతి


వెంకటేష్ మృతదేహం

మల్దకల్: మోటారుసైకిల్ ఢీకొన్న సంఘటనలో వ్యక్తి తీవ్రంగా గాయపడి చికిత్స పొందుతూ గురువారం కర్నూల్ ఆస్పత్రిలో మృతి చెందినట్లు ఎస్‌ఐ నందికర్ తెలిపారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాల ప్రకారం.. మల్దకల్ గ్రామ రైస్ మిల్లు సమీపంలో శనివారం అదే గ్రామానికి చెందిన బోయ వెంకటేష్(50) తన మోటారుసైకిల్‌పై గద్వాల నుంచి వస్తున్నాడు. సద్దలోనిపల్లి గ్రామానికి చెందిన వీరేష్ మల్దకల్ నుంచి తన మోటారుసైకిల్‌పై సద్దలోనిపల్లికి వెళ్లుతుండగా రెండు మోటారుసైకిళ్లు మల్దకల్ రైస్ మిల్లు వద్ద ఢీకొన్నాయి. దీంతో వెంకటేష్ తీవ్రంగా గాయపడ్డాడు. వెంటనే అతన్ని గద్వాల ఏరియా ఆస్పత్రికి తరలించారు. పరీక్షించిన వైద్యులు మెరుగైన వైద్యం కోసం కర్నూల్ ఆస్పత్రికి రెఫర్ చేశారు. చికిత్స పొందుతూ గురువారం మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. అతని కుమారుడు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తునట్లు ఎస్‌ఐ తెలిపారు.

రెండు బైక్‌లు ఢీ : ఒకరి దుర్మరణం


రామాంజనేయులు (ఫైల్)

ఉండవెల్లి: రెండు బైక్‌లు ఢీకొని ఒకరి మృతిచెందిన ఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఎస్‌ఐ శేఖర్ తెలిపిన వివరాల ప్రకారం గట్టు మండలం గొర్లఖాన్‌దొడ్డి గ్రామానికి చెందిన రామాంజనేయులు(25), మిత్రుడు నరసింహతో కలిసి కర్నూల్ నుంచి గ్రామానికి వస్తున్నాడు. కర్నూల్‌కు చెందిన అరుణ్, శశిధర్‌లు స్కూటీపై వారి గ్రామానికి వెళ్తుండగా ఎదురెదురుగా మండలంలోని పుల్లూరు టోల్‌ప్లాజా సమీపంలోని జాతీయ రహదారిపై ఢీకొన్నాయి. ఈ ప్రమాదంలో పల్సర్ బైక్‌పై ఉన్న రామాంజనేయులు అక్కడికక్కడే మృతిచెందగా నరసింహకు తీవ్రగాయాలయ్యాయి. మృతుడి తల్లి గోవిందమ్మ ఫిర్యాదు మేరకు అరుణ్‌పై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు. రామాంజనేయులుకు వివాహమై రెండు నెలలు అయ్యిందని కుటుంబ సభ్యులు తెలిపి కన్నీటిపర్యంతమయ్యారు.

పెళ్లికి నిరాకరించడంతో ఆత్మహత్యాయత్నం

గట్టు: ప్రేమించిన యువకుడు ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్లికి నిరాకరించడంతో ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన యువతి చిన్నోనిపల్లె గ్రామానికి చేరుకుని ప్రియుడి ఇంటి ముందే నిద్రమాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం రాత్రి చోటుచేసుకుంది. ఖమ్మం జిల్లా పాల్వంచకు చెందిన యువతి, చిన్నోనిపల్లె గ్రామానికి చెందిన యువకుడికి హైదరాబాద్‌లో కొచింగ్ తీసుకుంటున్న క్రమంలో పరిచయం ఏర్పడింది. పెళ్లి చేసుకుంటానని చెప్పిన యువకుడు తీరా ఉద్యోగం వచ్చిన తర్వాత పెళ్లి విషయం వాయిదా వేసుకుంటూ వచ్చాడు. దీంతో చివరికి ఆ యువతి చిన్నోనిపల్లె గ్రామానికి చేరుకుని యువకుడితో పెళ్లి విషయం మాట్లాడేందుకు సిద్ధమైంది. అతని కుటుంబ సభ్యులు యువతితో వివాహానికి నిరాకరించినట్లు తెలిసింది. దీంతో ఆ యువతి ప్రేమించిన యువకుడి ఇంటి దగ్గరే నిద్ర మాత్రలు వేసుకుని అపస్మారక స్థితికి చేరుకుంది. ఈ తరుణంలో గ్రామస్తులు కొందరూ ఆ యువతిని హుటాహుటిన రాత్రి గద్వాల ఆస్పత్రికి తరలించారు. అక్కడే చికిత్స పొందుతూ కొలుకున్నట్లు తెలిసింది. ఈ వ్యవహారంపై సమాచారం అందుకున్న గట్టు పోలీసులు గద్వాల ఆస్పత్రికి చేరుకుని సదరు యువతితో మాట్లాడి వివరాలను సేకరించారు. ఎస్‌ఐ మల్లేష్‌ను వివరణ కోరగా, ఈ సంఘటనకు సంబంధించి ఎలాంటి ఫిర్యాదు అందలేదని తెలిపారు. యువతి తల్లిదండ్రులకు సమాచారం ఇచ్చినట్లు ఎస్‌ఐ తెలిపారు.

నల్లకుంటలో పడి వ్యక్తి మృతి

జడ్చర్ల: మండల కేంద్రంలోని నల్లకుంటలో ప్రమాదవశాత్తు జారిపడి వ్యక్తి మృతి చెందిన ఘటన గురువారం చోటు చేసుకుంది. స్థానికులు తెలిపిన వివరాలు.. వాల్మీకినగర్‌కు చెందిన నాగరాజు(30) మానసిక స్థితి సరిగ్గా లేదు. ఈ నేపథ్యంలో గురువారం నల్లకుంటలో జారిపడి మృతి చెందినట్లు తెలిపారు. మృతుడి సోదరుడు నవీన్‌కుమార్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు పేర్కొన్నారు.

ఆయుర్వేదానికి ఆదరణ



- దీర్ఘకాలిక వ్యాధులు నయం
- గైనిక్ సమస్యల నుంచి ఉపశమనం
- గ్రామాల్లో సంప్రదాయ వైద్యం వైపు అడుగులు

గండేడ్: శతాబ్దాల చరిత్ర కలిగిన భారతీయ సంప్రదాయ ఆయుర్వే వైద్యానికి ఆదరణ పెరుగుతోంది. సాధారణ ఆరోగ్య సమస్యలతోపాటు దీర్ఘకాలిక వ్యాధులను నయం చేసేందుకు ఆయుర్వేద వైద్యం ఎంతో దోహదపడుతుండడంతో ప్రజలు సైతం ఇటువైపు మొగ్గుచూపుతున్నారు. ఇటీవల కాలంలో వివిధ రకాల అల్లోపతి, ఆయుర్వేదిక్, హోమియోపతి, యునాని వైద్యసేవలు ఉన్నాయి. వీటిలో ఎక్కువగా ప్రజలు అల్లోపతి వైద్యం పొందుతున్నా.. శాశ్వత నిర్మూలనలో భాగంగా ఆయుర్వేదంపై దృష్టి సారిస్తున్నారు. ఫలితంగా నాటి ఆయర్వేద వైద్యానికి తిరిగి ఆదరణ పెరుగుతుంది. మహబూబ్‌నగర్ జిల్లాలో జిల్లా ఆసుపత్రితోపాటు 17 పీహెచ్‌సీలు, 5 అర్బన్ పీహెచ్‌సీలు, 127 సబ్‌సెంటర్లు ఉన్నాయి. అలాగే, 9 ఆయుర్వేద వైద్యశాలలు, 3 ఉపకేంద్రాలు, 3 హోమియోపతి వైద్యశాలలు, 3 ఉపకేంద్రాలు ఉన్నాయి. వీటితోపాటు 4 యునాని వైద్యశాలలు, 2 ఉపకేంద్రాలు ఉన్నాయి.

వ్యాధి నివారణకు శాశ్వత పరిష్కారం

వేల సంవత్సరాల నాటి వైద్యమే ఆయుర్వేదం. ఆయు అంటే ఆయువు.. వేదం అంటే శాస్త్రం అని అర్థం. దీనినే జీవన శాస్త్రంగా పిలుస్తారు. మొక్కలు, మూలికలు, వేర్లు వంటి వాటితో వీటిని తయారుచేస్తారు. వీటి వాడకంతో ఎలాంటి సైడ్ ఎఫెక్స్ ఉండవు. అల్లోపతిలో వ్యాధి తీవ్రతను వెంటనే తగ్గించినా కూకటి వేళ్లతో అది పెకిలించలేదు. అదే ఆయుర్వేద వైద్యం అయితే ఆ రోగం ఎందుకు వచ్చింది, ఏ ధాతువులోపం వల్ల వచ్చిందన్న విషయాన్ని గుర్తించి శాశ్వత నివారణకు ఆయుర్వేద వైద్యం ఎంతగానో ఉపకరిస్తుంది. హార్మోన్ల సమతూకానికి ఇది ఎంతగానో సహకరిస్తుంది. రోగ నివారణకు శాశ్వత పరిష్కారం ఉన్నా ఆయుర్వేద వైద్యంలో ఎంతో ఓపిక అవసరం. మూడు నుంచి ఆరు నెలలు మందులు వాడితే సత్ఫలితాలు ఉంటాయని సూచిస్తున్నారు ఆయుర్వేద వైద్యులు. జిల్లాలో మహబూబ్‌నగర్, అడ్డాకుల్, గార్లపహాడ్, సీసీకుంట, దేవరకద్ర, కోయిల్‌సాగర్, రాజాపూర్, చిల్వేర్, వేపూర్ గ్రామాల్లో ఆయుర్వేద వైద్యశాలల్లో ఇటీవల రోగుల సంఖ్య పెరుగుతుంది. గండేడ్, హన్వాడ, కొత్లాబాద్ ఉపకేంద్రాలకు సైతం రోగుల తాకిడి పెరిగింది. గండేడ్ మండలం కేంద్రంలోని పీహెచ్‌సీలో ఈ ఆయుర్వేద విభాగం కొనసాగుతుంది. ప్రత్యేకంగా ఆయుర్వేద వైద్యాధికారిని కూడా నియమించారు. ఒకప్పుడు ఆదరణ లేక రోజుల తరబడి ఈ విభాగాలు ఖాళీగా దర్శనమిస్తుండగా.. కరోనా తర్వాత దీనికి ప్రాచుర్యం పెరిగింది. నేడు గండేడ్ ఆయుర్వేద కేంద్రంలో 30 నుంచి 50 మంది వరకు ఔట్ పేషెంట్లు వస్తున్నారు. పగిడ్యాల్, గండేడ్, రెడ్డిపల్లి, సల్కర్‌పేట్, కొంరెడ్డిపల్లి, జంగంరెడ్డిపల్లి తదితర గ్రామాల ప్రజలు ఆయుర్వేద సేవలు వినియోగించుకుంటున్నారు.


గండేడ్ ఆరోగ్య కేంద్రం

గైనిక్, దీర్ఘకాలిక రోగాలకు మేలు


గండేడ్‌లో రోగులను పరీక్షిస్తున్న వైద్యాధికారిణి

ఆయుర్వేద వైద్యం దీర్ఘకాలిక సమస్యలతో పాటు గైనిక్ సమస్యలకు చక్కటి ఫలితాలు ఇస్తుంది. కిడ్నీ, ఉబ్బసం, షుగర్, బీపీతో పాటు చర్మవ్యాధులకు ఆయర్వేద మందులు చక్కగా పనిచేస్తున్నాయి. ఏసీడీటీ, మలబద్ధకం, నిద్రలేమి, ఒత్తిడి, వంటివాటికి కూడా ఆయుర్వేదం వైద్యంతో ఉపశమనం లభిస్తుంది. వీటితోపాటు ఆడవాళ్లకు గైనిక్ సమస్యల పరిష్కారంలో సత్ఫలితాలు ఇస్తుంది. గర్భాశయంలో బుడగలు, నెలసరి సరిగా రాకపోవడం, మోనోపాజ్, పాల మోనోపాజ్, నెలసరిలో కడుపునొప్పి, సంతానలేమి ఇతర సమస్యలతో స్త్రీలు బాధపడుతుండగా, వీటన్నింటికి ఆయుర్వేద వైద్యం ద్వారా మెరుగైన చికిత్స పొందుతున్నారు. అలాగే మోకాళ్ల నొప్పులు, కీళ్లనొప్పులు తదితరవి కూడా పూర్తి స్థాయిలో కోర్సు తీసుకుంటే మెరుగైన ఫలితాలు వస్తున్నాయి. త్రిఫలచూర్ణం, అష్టగంధ, భాస్కర లవణం, కర్పూరాది తైలం, నిరుంధ తైలం, బ్రింగరాజ్ హెయిర్ ఆయిల్, కంచనగుగ్గులు, శతవరి, అశోక అరిష్ట వంటి ఆయుర్వేద మందులు రోగాల నయంలో కీలకపాత్ర పోషిస్తున్నాయి. గ్రామాల్లో ఎక్కువగా వయస్సు పైబడ్డవారే ఈ ఆయుర్వేద వైద్యంపై దృష్టి సారిస్తున్నారు. ఖర్చు తక్కువతోపాటు ఎలాంటి సైడ్ ఎఫెక్టులు లేకపోవడంతో పాటు పూర్తిగా రోగాలు నయమవడంతో ఆయుర్వేదానికి విరివిగా ఆదరణ పెరుగుతున్నది.

కిడ్నీలో రాళ్లు కరిగిపోయాయి..



కిడ్నీలో 4 మి.మీ పరిమాణం గల రాళ్లు ఉన్నాయని డాక్టర్లు చెప్పారు. ప్రైవేటు వైద్యం అయితే ఖర్చు ఎక్కువ అవుతుందని, తెలిసిన వారు చెప్పడంతో గండేడ్‌లోని ఆయుర్వేద వైద్యాధికారిని ఆశ్రయించా. మూడు నెలలకు మందులు ఇచ్చారు. అవి వాడగానే రాళ్లు కరిగిపోయాయి. దాని తర్వాత ఫ్యాటీ లివర్ వచ్చింది. దీనికి కూడా రెండు నెలలుగా మందులు వాడుతున్నాను. అది తగ్గు ముఖం పట్టింది. ఈ మందులు వల్ల ఎన్నో ఏళ్లుగా ఉన్న నడుం నొప్పి పూర్తిగా తగ్గింది. ఆయుర్వేద మందులపై పూర్తి నమ్మకం కలిగింది. – శ్రీకాంతాచారి, రంగారెడ్డిపల్లి

తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు



ఆయుర్వేద వైద్యం గ్రామీణ ప్రజలకు అనువైన వైద్యం. తక్కువ ఖర్చుతో ఎక్కువ ప్రయోజనాలు ఉన్నాయి. మూడు నుంచి ఆరు నెలలు వాడితే దీని వల్ల సత్ఫలితాలు ఉంటాయి. ఎలాంటి సైడ్ ఎఫెక్టులు లేకపోవడమే కాక రోగాన్ని కూకటి వేళ్లతో తొలగించడంలో ఆయుర్వేద వైద్యం దిట్ట. శరీరంలోని సమతూల్యతను పెంపొందిస్తూ రోగం పూర్తిగా నయం చేయడానికి ఆయుర్వేద మూలికలు ఉపకరిస్తున్నాయి. పెద్ద వయస్సు వాళ్లు ఎక్కువ ఈ మందుల వినియోగంపై ఆసక్తి చూపుతున్నారు. మిగతా గ్రామీణ ప్రజలు పూర్తిస్థాయిలో ఆయుర్వేద వైద్య సేవలను వినియోగించుకోవాలి. – శిల్ప, ఆయుర్వేద వైద్యురాలు, గండేడ్

‘అమ్రాబాద్’లో పెరిగిన పెద్ద పులుల సంఖ్య

ఫేజ్ – 4 లెక్కింపు పూర్తి..
36కు చేరిన పులులు


అడవిలో అమర్చిన కెమెరా ట్రాప్‌లను పరిశీలిస్తున్న అటవీశాఖ అధికారులు


అభయారణ్యంలో కెమెరాకు చిక్కిన పెద్ద పులి

మన్ననూర్: అమ్రాబాద్ పులుల రక్షిత అభయారణ్యం ఫేజ్– 4లో 2024–25 లెక్కల ప్రకారం పెద్ద పులుల సంఖ్య ఘననీయంగా పెరిగిందని అమ్రాబాద్ ఎఫ్‌ఆర్‌ఓ వీరేశం గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 10 అటవీశాఖ రేంజ్‌లను 4 బ్లాక్‌లుగా విభజించి సాంకేతిక పద్ధతిలో కెమెరా ట్రాప్‌ల ద్వారా ఈ లెక్కింపును చేపట్టినట్లు పేర్కొన్నారు. మద్దిమడుగు – అమ్రాబాద్ రేంజ్‌ను 1వ బ్లాక్‌గా గుర్తించి 236 లొకేషన్లలో కెమెరాల్లో గుర్తించిన వాటి ఆధారంగా లెక్కింపు చేపట్టామని తెలిపారు. అలాగే, మన్ననూర్–దోమలపెంట 2వ బ్లాక్‌లో 228 లొకేషన్లలో, అచ్చంపేట – లింగాల – కొల్లాపూర్ 3వ బ్లాక్‌లో 205 లొకేషన్లలో, అచ్చంపేట–కంబాలపల్లి–దేవరకొండ–నాగార్జునసాగర్ 4వ బ్లాక్‌లో 128 లొకేషన్లలో కెమెరాలో గుర్తించిన వాటి ఆధారంగా లెక్కించామని పేర్కొన్నారు. మొత్తం 10 రేంజ్‌లకుగాను 797 లొకేషన్లలో 4 నెలల వ్యవధిలో పులుల సంఖ్య కనుగొన్నట్లు తెలిపారు. 2023–24లో 11 మగ పులులు, 15 ఆడ, 7 పులి పిల్లలు ఉండని, 2024–25కు మొత్తం పెద్ద పులులు సంఖ్య 36కు చేరిందని తెలిపారు. వీటిలో 13 మగ పులులు, 20 ఆడ పులులు, రెండు పులి పిల్లలు ఉన్నట్లు గుర్తించామని, పెద్దపులుల పునరుత్పత్తి సామర్థ్యం ఘననీయంగా పెరుగుతుందని తెలిపారు.

స్వగ్రామంలో చందునాయక్ అంత్యక్రియలు

భారీగా తరలివచ్చిన పార్టీ శ్రేణులు, ప్రజలు


చందూనాయక్ మృతదేహం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

బల్మూర్: సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు చందునాయక్‌ను అంత్యక్రియలను ఆయన స్వగ్రామం నాగర్‌కర్నూల్ జిల్లా బల్మూర్ మండలంలోని నర్సాయపల్లిలో గురువారం నిర్వహించారు. ముందుగా గ్రామంలో అంతిమయాత్ర జరపగా హైదరాబాద్ తోపాటు జిల్లాలోని సీపీఐ, సీపీఎం నాయకులు, నియోజకవర్గంలోని వివిధ గ్రామాల ప్రజలు, బంధువులు పెద్దసంఖ్యలో తరలివచ్చి ఆయన మృతదేహం వద్ద పుష్పగుచ్ఛాలు ఉంచి కన్నీటి వీడ్కోలు పలికారు. ఈ సందర్భంగా అంత్యక్రియల్లో పాల్గొన్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు ఈటి నర్సింహ మాట్లాడుతూ చందునాయక్‌ను కాల్చి చంపిన దుండగులను కఠిన శిక్షించాలని డిమాండ్ చేశారు. చందునాయక్ విద్యార్థి దశ నుంచే ఎస్ఎఫ్ఐలో చురుకైన పాత్ర పోషించి విద్యా సమస్యలపై పోరాడి సీపీఐలో చేరి హైదరాబాద్ వంటి మహానగరంలో పేదల ఇళ్ల స్థలాలు, వారి సమస్యలపై అలుపెరగని పోరాటం చేశారని కొనియాడారు. చందునాయక్ కుటుంబానికి అండగా ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో హైదరాబాద్ సిటీ సీపీఐ కార్యదర్శి చాయాదేవి, సీపీఎం రాష్ట్ర నాయకులు శ్రావణ్‌కుమార్, జిల్లా కార్యదర్శి వర్ధం పర్వతాలు, కార్యదర్శివర్గ సభ్యులు దేశ్యానాయక్, గిరిజన సేవా సంఘం రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు బిచ్చానాయక్, గిరిజన సంఘం జిల్లా కార్యదర్శి శంకర్‌నాయక్, కేవీపీఎస్ జిల్లా కార్యదర్శి పరశురాములు, యూటీఎఫ్ జిల్లా అధ్యక్షుడు కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

కేఎస్పీ డి-19 కాల్వకు గండి


కాల్వ గండికి అడ్డగా రాళ్లు పెడుతున్న రైతు

మరికల్: మండలంలోని వెంకటాపూర్ శివారులో కోయిల్‌సాగర్ డీ–19 కాలువ గురువారం గండి పడింది. దీంతో ఓ రైతుకు సంబంధించిన పది ఎకరాల వరి పంటకు నష్ట వాటిల్లింది. రెండు రోజుల కిందట కోయిల్‌సాగర్ నుంచి అధికారులు సాగు నీటిని విడుదల చేశారు. కుడి కాలువ నుంచి డీ 19 కాలువకు నీరు ఉధృతంగా రావడంతో గండి పడింది. వెంకటాపూర్‌కు చెందిన రైతు వెంకటేశ్వర్‌రెడ్డి పది ఎకరాలలో కర్రిగేట చేసి నేరుగా వడ్లు చల్లాడు. ఈ పొలానికి అధిక మొత్తంలో నీరు ప్రవహించి నిల్వ ఉంది. దీంతో వడ్లు మొలకెత్తలేదని బాధిత రైతు ఆందోళన వ్యక్తం చేశాడు. దాదాపు రూ.లక్ష వరకు నష్టం వాటిల్లిందని రైతు వాపోయాడు. అధికారుల ముందుచూపు లేకుండా నీరు విడుదల చేయడంతోనే కాలువలకు గండ్లు పడుతున్నాయని విమర్శలు వినిపిస్తున్నాయి. సంబంధిత అధికారులు వెంటనే స్పందించి గండిపడ్డ కాలువకు మరమ్మతు చేయాలని కోరుతున్నారు.

హత్యాయత్నం కేసులో నిందితుల రిమాండ్


వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ వెంకటేశ్వర్లు

రాజాపూర్(బాలానగర్): హత్య చేసేందుకు ప్రయత్నించిన సుపారీ గ్యాంగ్‌ను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు డీఎస్పీ వెంకటేశ్వర్లు తెలిపారు. బాలానగర్ పోలీసు స్టేషన్‌లో గురువారం వివరాలు వెల్లడించారు. రాజాపూర్ మండలం సింగమ్మతండా గ్రామపంచాయతీ కేస్యనాయక్ తండాకు చెందిన బాలూనాయక్‌ను హతమార్చేందుకు సింగమ్మతండాకు చెందిన సేవాలాల్ శ్రీను సుపారీ ఇచ్చి కుట్ర పన్నినట్లు తెలిపారు. ఈ నెల 10న బాలూనాయక్ బాలానగర్ మండలం చెన్నంగులతండా కేజీబీవీలో పిల్లలను చేర్పించేందుకు వెళ్తుండగా మాటువేసి కారుతో ఢీకొట్టగా బాధితుడు చాకచక్యంతో సమీప తండాకు పారిపోయి పరారైనట్లు పేర్కొన్నారు. బాధితుడి ఫిర్యాదు మేరకు బాలానగర్ పీఎస్‌లో కేసు నమోదు చేసినట్లు తెలిపారు. బుధవారం సుపారీ గ్యాంగ్ మరోసారి దాడి చేస్తుందన్న సమాచారం మేరకు పోలీసులు పెద్దాయపల్లి చౌరస్తాలో పది మంది ఉన్న గ్యాంగ్‌లో ఏడుగురిని పట్టుకొని గురువారం రిమాండ్ తరలించినట్లు డీఎస్పీ వెల్లడించారు. ఏ1గా ఉన్న సేవాలాల్‌శ్రీను, ఏ3 అఫ్రోజ్, ఏ8 రాకేష్ టిక్లా పరారీలో ఉన్నట్లు పేర్కొన్నారు. జడ్చర్ల రూరల్ సీఐ నాగార్జునగౌడ్, బాలానగర్, రాజాపూర్ ఎస్‌ఐలు లెనిన్‌గౌడ్, శివానందంగౌడ్, కానిస్టేబుళ్లు వెంకటేష్, బాలచంద్రుడు పాల్గొన్నారు.

రాష్ట్ర విద్యార్థులు ప్రపంచస్థాయిలో ప్రతిభ చాటాలి


నిడ్జింత ఉన్నత పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడుతున్న రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితా రాణా.. చిత్రంలో కలెక్టర్ సిక్తా పట్నాయక్

- విద్యాశాఖ పథకం ఏదైనా కొడంగల్ నుంచే ప్రారంభం
- రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా

కోస్గి రూరల్/కొత్తపల్లి: తెలంగాణ రాష్ట్ర విద్యార్థులు ప్రపంచస్థాయిలో ప్రతిభ చాటాలని రాష్ట్ర విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి యోగితారాణా కోరారు. గురువారం విద్యాశాఖ కార్యక్రమాల అమలు తీరుతెన్నుల పరిశీలన నిమిత్తం గుండుమాల్ ఆదర్శ పాఠశాల, కొత్తపల్లి మండలం నిడ్జింత జెడ్పీ ఉన్నత పాఠశాలను కలెక్టర్ సిక్తా పట్నాయక్, కాడా ప్రత్యేక అధికారి వెంకట్‌రెడ్డితో కలిసి పరిశీలించారు. నిడ్జింత పాఠశాలలో విద్యార్థులతో కలిసి అల్పాహారం చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యాశాఖపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ప్రత్యేక శ్రద్ధ చూపుతున్నారని, కొత్త పథకం రూపొందిస్తే తన నియోజకవర్గం కొడంగల్ నుంచే అమలు చేస్తున్నారని, అందులో భాగంగా న్యూట్రీషన్‌తో కూడిన అల్పాహారం కొడంగల్‌లోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమలవుతుందని చెప్పారు. ఇంట్లో తల్లిదండ్రులు, పాఠశాలలో ఉపాధ్యాయులు తమ బాధ్యతలు గుర్తిస్తే విద్యార్థులకు చదువుపై శ్రద్ధ పెరుగుతుందన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు మౌలిక వసతులు కల్పించడంతో పాటు ఉచిత విద్య అందుతుందని.. ప్రైవేట్‌కు వెళ్తే రూ.లక్షల్లో ఫీజులు వసూలు చేస్తారని తెలిపారు. నియోజకవర్గంలోని అన్ని పాఠశాలలకు కంప్యూటర్లు అందించామని చెప్పారు. పీఎంశ్రీ కింద ఎంపికైన గుండుమాల్ ఆదర్శ పాఠశాలకు కేంద్రంతో పాటు రాష్ట్రం నుంచి కూడా భారీగా నిధులు మంజూరు అవుతాయని.. కాడా నుంచి ఇప్పటికే రూ.60 లక్షల ప్రత్యేక నిధులు ఇచ్చామన్నారు. విద్యాశాఖ డైరెక్టర్ నవీన్ నికోలస్ మాట్లాడుతూ.. కస్తూర్బా పాఠశాలల్లో కాంట్రాక్టు ఉపాధ్యాయులు పదోతరగతి వార్షిక పరీక్షల్లో 99 శాతం ఫలితాలు సాధిస్తుంటే, రెగ్యులర్ సిబ్బంది ఉన్న మోడల్ స్కూళ్లలో 85 శాతం మాత్రమే ఉత్తీర్ణత సాధించడమేమిటని ప్రశ్నించారు. మోడల్ స్కూల్ ఉపాధ్యాయులు ప్రత్యేక శ్రద్ధ కనబర్చి ఉత్తమ ఫలితాల సాధనకు కృషి చేయాలన్నారు. ఎంసెట్, నీట్ శిక్షణ కూడా ఇస్తున్నామని.. అవసరమైతే కంప్యూటర్లను అందిస్తామని తెలిపారు. గుండుమాల్ ఆదర్శ పాఠశాలలో విద్యార్థులతో మాట్లాడి మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు. ల్యాబ్‌ల నిర్వహణ, మరుగుదొడ్లు, పరిసరాలు అపరిశుభ్రంగా ఉండటంతో ప్రిన్సిపాల్‌పై ఆగ్రహం వ్యక్తం చేశారు. పనితీరు మార్చుకోవాలని హెచ్చరించారు. నిడ్జింత జెడ్పీ ఉన్నత పాఠశాలలో విద్యాశాఖ అధికారులతో సమీక్ష నిర్వహించి అమలు చేస్తున్న కార్యక్రమాలపై చర్చించారు. వారి వెంట శిక్షణ కలెక్టర్ ప్రణయ్‌కుమార్, విద్యాశాఖ జాయింట్ డైరెక్టర్లు వెంకటనర్సమ్మ, మదన్, ఆర్జేఈడీ విజయలక్ష్మీ, రాష్ట్ర విద్యాశాఖ జీసీడీఓ శిరీష, జిల్లా విద్యాధికారి గోవిందరాజులు, జీసీడీఓ నర్మద, విద్యాశాఖ అధికారులు విద్యాసాగర్, యాదయ్య ఉన్నారు.

దోమలపెంట మారింది బ్రహ్మగిరిగా

- గ్రామస్తులకు గెజిట్ కాపీ అందజేసిన ఎమ్మెల్యే వంశీకృష్ణ



బ్రహ్మగిరిగా పేరు మార్చిన గెజిట్‌ను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే వంశీకృష్ణ దంపతులు

దోమలపెంట: దోమలపెంట గ్రామ ప్రజల చిరకాల కోరిక నెరవేరింది. దోమలపెంటను బ్రహ్మగిరి గ్రామ పంచాయతీగా పేరు మారుస్తూ అచ్చంపేట ఎమ్మెల్యే వంశీకృష్ణ సతీమణి అనురాధతో కలిసి గురువారం దోమలపెంటలో నిర్వహించిన గ్రామ మహిళల సభలో రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన గెజిట్ కాపీని గ్రామస్తులకు అందజేశారు. బ్రహ్మగిరిగా పేరు మారుస్తూ ఏప్రిల్ 15న రాజపత్రం విడుదల చేసినట్లు తెలిపారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. బ్రహ్మగిరిలో మహిళా సమాఖ్య ఆధ్వర్యంలో పెట్రోల్ బంక్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. వీలైనంత త్వరలో ఇంటింటికి రోజుకు రెండుసార్లు నీళ్లు సరఫరా అయ్యేలా చర్యలు తీసుకుంటున్నామన్నారు. శ్రీశైలం రహదారిలో రోడ్డు ప్రమాదాల బాధితులకు ఆసరాగా మన్ననూర్ ఆస్పత్రిలో సకల సౌకర్యాలు కల్పించనున్నట్లు పేర్కొన్నారు. గ్రామంలో శ్రీశైలం ఆనకట్ట నిర్మాణం సందర్భంలో నిర్మించిన రిక్రియేషన్ క్లబ్‌ను మహిళా మండలి ఆధ్వర్యంలో ఫంక్షన్ హాల్‌గా మారుస్తానని, దీని నిర్వహణ బాధ్యత మహిళా సమాఖ్యకే అప్పగిస్తామన్నారు. త్వరలో స్థానికంగా ఆస్పత్రి భవనం ప్రారంభోత్సవం చేస్తానన్నారు. ఇందిరమ్మ రాజ్యం ఇంటింట సౌభాగ్యంలో భాగంగా మహిళా వికాసం పథకంలో బ్రహ్మగిరి మహిళలకు రూ.లక్ష రుణం మంజూరు చేస్తామన్నారు. ఏడాది కాలంలో బ్రహ్మగిరిని మరింత అభివృద్ధి చేస్తానని హామీనిచ్చారు. ఈ సందర్భంగా స్థానిక కాంగ్రెస్ నాయకులు గ్రామంలో పోలీసులు, ఆస్పత్రికి సిబ్బందికి క్వార్టర్స్ నిర్మించాలని ఎమ్మెల్యేను కోరారు. అనంతరం ఆర్యవైశ్యులు ఎమ్మెల్యే దంపతులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ మండలాధ్యక్షుడు హరినారాయణగౌడ్, ఛత్రూనాయక్, మోయిజ్, బజ్జం మల్లికార్జున, గురువయ్య తదితరులు పాల్గొన్నారు.

పోక్సో కేసులో జీవిత ఖైదు

రూ.10 వేలు జరిమానా

మహబూబ్‌నగర్ క్రైం: మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో నమోదు అయిన పోక్సో కేసులో నిందితుడికి జీవిత ఖైదుతో పాటు జరిమానా విధిస్తూ న్యాయమూర్తి తీర్పు వెల్లడించారు. పూర్తి వివరాలు.. 2016లో మహ్మదాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ గ్రామానికి చెందిన 15 ఏళ్ల బాలికపై జిలకరపురం కృష్ణయ్య అనే వ్యక్తి లైంగికంగా దాడి చేయడంతో పోక్సో కింద కేసులు నమోదైంది. గురువారం విచారణ చేపట్టిన ప్రత్యేక సెషన్స్ కోర్టు న్యాయమూర్తి నిందితుడు కృష్ణయ్యకు జీవిత ఖైదుతో పాటు రూ.10 వేలు జరిమానా విధిస్తూ తీర్పు ఇచ్చారు. నేరస్తుడికి శిక్షపడే విధంగా కృషి చేసిన కోర్టు సిబ్బందితో పాటు పబ్లిక్ ప్రాసిక్యూటర్, పోలీసు అధికారులు, సిబ్బందిని ఎస్పీ జానకి అభినందించారు.

ముగ్గురు నిందితులకు జైలు శిక్ష

రెండు రోజుల్లో కేసు ఛేదించిన పోలీసులు


విలేకరులతో మాట్లాడుతున్న పోలీసు అధికారులు

వంగూరు: మండలంలోని రంగాపూర్ గ్రామానికి చెందిన మహిళ ఈనెల 14న వ్యవసాయ పొలం నుంచి ఇంటికి వెళ్తుండగా, ఆమె మెడలో ఉన్న పుస్తెలతాడును లాక్కెళ్లిన నిందితులను గురువారం పోలీసులు రిమాండ్‌కు తరలించారు. దీనికి సంబంధించి వెల్దండ సీఐ విష్ణువర్ధన్‌రెడ్డి, వంగూరు ఎస్‌ఐ మహేష్‌లు గురువారం విలేకరులతో మాట్లాడారు. అచ్చంపేట మండలం లింగోటం గ్రామానికి చెందిన రేణయ్య అతని బంధువు బల్లుల ఆంజనేయులు, ఉప్పునుంతల గ్రామానికి చెందిన మొగిలి ఆంజనేయులు కారులో రంగాపూర్ మీదుగా వెళ్తూ ఒంటరిగా కనిపించిన మహిళ మెడలో పుస్తెలతాడును లాక్కెళ్లారు. ఈ సంఘటనపై వంగూరు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో విచారణ చేసి నిందితులను గుర్తించి రిమాండ్‌కు పంపిస్తున్నట్లు సీఐ, ఎస్‌ఐలు తెలిపారు.

23 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

అచ్చంపేట రూరల్: అక్రమంగా నిల్వ ఉంచిన 23 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని గురువారం ఎస్‌ఐ విజయభాస్కర్, సిబ్బంది పట్టుకున్నారు. పట్టణ శివారులో నూతనంగా నిర్మిస్తున్న అయ్యప్ప దేవాలయ సమీపంలో ఓ గదిలో రేషన్ బియ్యం అక్రమంగా నిల్వ ఉంచారని నమ్మదగిన సమాచారం రావడంతో ఎస్‌ఐ తన సిబ్బందితో అక్కడికి చేరుకున్నాడు. గదిలో రేషన్ బియ్యాన్ని గుర్తించి పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. నిల్వ ఉంచిన వ్యక్తి ఇట్టి చంద్రశేఖర్‌పై కేసు నమోదు చేశామని ఎస్‌ఐ తెలిపారు.